ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025 | 5





ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న విద్యాశాఖ ఏడీ రామలింగం, ఆర్‌జేడీ నాగమణి

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లు

- 28న గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశీలన ప్రక్రియ
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 1241 అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- పరిశీలకుడిగా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం నియామకం

6

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- మంత్రి లోకేశ్ చొరవతో ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో ఉత్సవ కమిటీలకు ఊరట
- వచ్చేనెలలో విజయదశమికి ఏర్పాటు చేసే మండపాలకూ ఉచిత విద్యుత్ సౌకర్యం

పిఠాపురం,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలు, పందిర్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవాలు జరిగే అన్నిరోజుల్లో ఉచిత విద్యుత్ అందజేయాలని వివిధ గణేష్ ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులు రాష్ట్ర ఐటీ,విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో ఆయన చర్చించారు. దీంతో ఉచిత విద్యుత్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని లోకేశ్ ట్విట్టర్(ఎక్స్), ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దసరా సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు కూడా ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం

వినాయక చవితి సందర్భంగా జరిగే నవరాత్రి ఉత్సవాలు జరిగే అన్ని రోజులకు విద్యుత్ సరఫరా నిమిత్తం నిర్వాహకులు తాత్కాలిక కరెంటు కనెక్షన్ తీసుకోవడం లేదా ఇతర కనెక్షన్లనుంచి సరఫరా తీసుకుని సొమ్ములు చెల్లించేవారు. ఇప్పుడు ఆ బాధ తప్పింది. దీనివల్ల కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో 7,500 పెద్ద, మధ్య తరహా వినాయక మండపాలు, మరో 10వేల వరకూ చిన్నతరహా మండపాలు, పందిర్ల నిర్వాహకులకు ఉపశమనం కలగనుంది. ఈ మండపాలన్నింటికీ ఉచిత విద్యుత్ ఎలా అందించాలనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. దానికి అనుగుణంగా కరెంటు కనెక్షన్లు ఇస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.25కోట్లు, ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.4కోట్ల వరకూ ఉచిత విద్యుత్‌కు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరించనుంది. మండపాలకు ఉచిత విద్యుత్ అందించేలా చొరవ తీసుకున్న మంత్రి నారా లోకేశ్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

బొమ్మ.. పలుకు!



రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు చెక్

- భూ యజమానుల ముఖచిత్రాలు
- నకిలీల బెడదకు బ్రేక్
- నిజమైన లబ్ధిదారులకే పత్రాలు
- ఓటీపీ వస్తేనే రిజిస్ట్రేషన్ పూర్తి
- ప్రిపరేషన్ డేటాలో ఫొటో

అక్రమ రిజిస్ట్రేషన్లు, ఒకే స్థలానికి డబుల్ రిజిస్ట్రేషన్.. దొంగ భూయజమానులు, నకిలీ దస్తావేజులు.. ఫేక్ వ్యవహారాలన్నింటికి కూటమి ప్రభుత్వం పూర్తిగా చెక్ పెట్టింది. అక్రమాల అడ్డుకట్టకు కొత్త విధానాన్ని తీసుకొచ్చింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్ పెడుతూ రిజిస్ట్రేషన్ శాఖ పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. దొంగ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా ఒకరి భూములు వేరొకరి పేరున అక్రమ రిజిస్ట్రేషన్లు పెద్ద ఎత్తున జరిగిపోయాయి. అసలైన భూ యజమానులకు తెలియకుండానే పత్రాలు మారిపోయేవి. ఎవరినో తీసుకొచ్చి అతనిదే భూమి అని చెప్పి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించడం, ఒకే పేరు ఉన్న వ్యక్తులను తీసుకొచ్చి ఆధార్ మార్పులు(నకిలీ) చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు సైతం అధికంగా జరిగాయి..ఇలాంటి వాటికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు తెచ్చింది.రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే డాక్యుమెంట్ ఎవరు చేయించుకుంటున్నారో స్పష్టంగా తెలిసేలా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. రిజిస్ట్రేషన్లలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.

ఓటీపీలతో చిక్కులు..

ఈ నూతన విధానం అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టేలా ఉన్నా.. సాంకేతిక చిక్కులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఓటీపీ(వన్‌టైం పాస్‌వర్డ్)లు కొందరికి సరిగా రావడం లేదు. మొబైల్ ఫోన్ ఆధార్‌కు లింకు చేసుకోని వారికి ఇది ఇబ్బందిగా మారింది. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చి డాక్యుమెంటేషన్ చేయించుకోలేని పరిస్థితి కొందరికి ఎదురవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటీపీ ద్వారా వచ్చే మెసేజ్‌లు అర్థం కాక ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. ఆధార్ నంబర్ నమోదు చేయగానే ఓటీపీ రాకుండా కేవలం ఫొటో వచ్చేలా చేస్తే బాగుంటుందని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో ఇది వరకు సంబంధిత వ్యక్తుల వివరాలు మాత్రమే వచ్చేవి. భూమికి సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చినా తెలిసేది కాదు. కానీ నేడు మాత్రం సం బంధిత వ్యక్తి ఆధార్ నంబర్ చెప్పగానే అందులో ఉన్న ఫొటో ప్రిపరేషన్ డేటాలో వస్తుంది. కొన్ని రోజులుగా ఈ విధానం అమలవుతోంది. అంతేకాదు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే డాక్యుమెంట్లను తీసుకునేందుకు క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడేవారు. కొంత మంది మధ్యవర్తులు జోక్యం చేసుకుని డాక్యుమెంట్లు తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంట్ రైటర్లు ఎవరో ఒకరికి ఇవ్వడం ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి దక్కడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుత విధానంలో ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే కార్యాలయంలో వేలి ముద్రలు వేయాల్సి ఉంది. ఆ తర్వాత డాక్యుమెంట్‌ను యజమానికిస్తారు.

మోసాలకు చెక్ పెట్టొచ్చు..

రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో గతంలో ఫొటోలు వచ్చేవి కావు. ఇప్పు డు ఆధార్ ఓటీపీ విధానంతో ఫొటో వస్తోంది. దీంతో సంబంధిత వ్యక్తి అసలైన యజమానేనా అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీని వల్ల మోసాలకు చెక్ పెట్టొచ్చు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంట్‌ను కూడా ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే తీసుకోవచ్చు. వేలిముద్ర వేయడం ద్వారా సంబంధిత వ్యక్తి తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త విధానం చాలా బాగుంది. అక్రమాలకు అవకాశం ఉండదు.

-జె.ఎన్.యు.లక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ (ఎఫ్ఏసీ), కాకినాడ



మట్టి గణపతే.. మహా గణపతి

6

మట్టి గణపతే మహా గణపతి అంటున్నారు.. రంగుల విగ్రహాలను వదిలి వీటివైపు భక్తజనం చూస్తున్నారు. దీంతో మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. బుధవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో ఎక్కడ చూసినా బుల్లి బుల్లి మట్టి విగ్రహాలే దర్శనమిస్తున్నాయి.

క్రమశిక్షణతో పనిచేసే వారికి

పార్టీలో పెద్దపీట

- రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- కాకినాడలో పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు

కాకినాడసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో పెద్దపీట లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం కాకినాడ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పరిశీలకులుగా మంత్రి అచ్చెన్నాయుడు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, విశాఖ మహా రుడా చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ విచ్చేశారు. సమావేశానికి కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షత వహించగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం అభివృద్ధి దిశగా పార్టీ తలపెట్టిన కార్యక్రమాలు, జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై పార్టీ నాయకులతో చర్చించారు.

జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడి ఎంపికపై ప్రతిపాదనలను మంత్రి అచ్చెన్నాయుడు స్వీకరించారు. ఆయా కమిటీల ఎంపికపై క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్లమెంటరీ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి అందరూ ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ స్థాయి కార్యకలాపాల్లో క్రమబద్ధత, సమన్వయం అవసరమని, కొత్తగా నియమితులయ్యే పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీ సభ్యులు పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా పార్లమెంట్‌స్థాయి నాయకత్వం బలపడుతుందని, కార్యకర్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టసాధ్యమైన పోరాటం ద్వారానే పార్టీ విజయాలు సాధిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీకోసం అహర్నిశలు శ్రమించే నాయకుల వివరాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి ఆయా కమిటీల్లో కీలక బాధ్యతలు అప్పగిస్తామన్నారు. కమిటీల నియామకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతిపాదనలను అధ్యయనం చేసి అధిష్ఠానానికి నివేదిస్తామన్నారు. అనంతరం కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీకోసం క్రమశిక్షణతో పనిచేసే నాయకులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎప్పుడూ పెద్దపీట వేస్తారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ మేయర్ సుంకర పావని, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల అప్పారావు, మట్టా ప్రకాష్ గౌడ్, నాయకులు గుణ్ణం చంద్రమౌళి, వాసిరెడ్డి ఏసుదాసు, పెంకే శ్రీనివాసబాబా, కటకంశెట్టి బాబి, గదుల సాయిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మల్లిపూడి వీరు, సుర్ల అప్పలరాజు, రాజా సూరిబాబురాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సుంకర తిరుమలకుమార్, బోళ్ల కృష్ణమోహన్, మేకా లక్ష్మణమూర్తి, గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు. తొలుత కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాకినాడ పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష పదవికి ప్రధానంగా జ్యోతుల నవీన్, తోట నవీన్ పేర్లు ప్రతిపాదనకు వచ్చినట్లు తెలిసింది.

నేత్రదాన పక్షోత్సవాల బ్యానర్ ఆవిష్కరణ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల ఫ్లెక్సీ బ్యానర్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదాన క్యాంపులు సోమవారం ప్రారంభంకాగా.. వచ్చేనెల 8 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లావైద్యఆరోగ్య శాఖాధికారి నరసింహనాయక్ మాట్లాడుతూ క్యాంపులు కాకినాడ జీజీహెచ్, తుని ఏరియా ఆస్పత్రి, అన్నిమండలాల్లో పీఎంఎంఓస్, అప్తాల్మిక్ అసిస్టెంట్‌ల ద్వారా జరుగుతుందన్నారు. నేత్రదానానికి ముందుకు వచ్చేవారికి ఐడీకార్డులు, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. కార్నియల్ బ్లైండ్‌నెస్‌ను నివారించడానికి నేత్రదానంపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టరు శ్రీవిద్య పాల్గొన్నారు.

ఎంపికైన కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 6

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. పెళ్లి కోసం నేరం.. 7

కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సు సస్పెన్షన్ 7

లక్కవరంలో వ్యక్తి దారుణ హత్య 6

బిడ్డకో రేటు!

జీజీహెచ్ జీవోటీలో సిబ్బంది దందా

- సాధారణ ప్రసవమైతే రూ.2వేలు
- సిజేరియన్‌కు రూ.4వేలు
- ఆడబిడ్డ పుడితే రూ.3 వేలు
- గగ్గోలు పెడుతున్న సామాన్యులు



ఉభయ గోదావరి జిల్లా ఆరోగ్య ప్రధాయిని అయిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)కు ప్రతిరోజు వైద్యం నిమిత్తం సుమారు 4 వేల మంది వస్తుంటారు. వారిలో సుమారు 200 మంది మహిళలు ప్రసూతి వైద్యం నిమిత్తం వస్తుంటారు. గైనిక్ విభాగంలో రోజుకు 40 వరకు సాధారణ ప్రసవాలు, 20 వరకు శస్త్రచికిత్స ద్వారా సిజేరియన్ ప్రసవాలు జరుగుతూ ఉంటాయి. జీజీహెచ్‌లోని గైనిక్ ఆపరేషన్ థియేటర్ (జీవోటీ)కి బిడ్డ అడ్డం తిరిగినా లేక ఉమ్మనీరు తగిన మోతాదులో లేక పోయినా తదితర కారణాల వల్ల వచ్చే గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్ (శస్త్రచికిత్స) ద్వారా గైనిక్ వైద్యులు ప్రసవం చేస్తారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బంది ఆపరేషన్ అయిన బాలింతను జీబీసియూకు అక్కడ నుంచి సాధారణ వార్డుకు తరలిస్తుంటారు. అదే గైనిక్ విభాగంలోని లేబర్ రూమ్‌లో సాధారణ ప్రసవాలు జరుగుతుంటాయి. ఇవే కాకుండా మగ శిశువు పుడితే ఒక రేటు, ఆడ శిశువు పుడితే మరో రేటు అక్కడ సిబ్బంది ఫిక్స్ చేశారు. ఒకవేళ శిశువు జననం తరువాత సిబ్బందికి డబ్బులు వారు అడిగినంత ఇవ్వలేదో ఆ శిశువు తల్లి, కుటుంబీకులకు ఆ సిబ్బంది నరకం చూపెట్టడం కాయం. అందు వల్ల సామాన్యులు, పేదలు ఉన్నవాళ్ళు తప్పేది లేక ఆ తల్లి బిడ్డలను ఏంచేస్తారోనని భయపడి అప్పోసప్పో చేసి సిబ్బందికి ముడుపులు చెల్లించుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. కొంత మంది బాధితులు అడపాదడపా ఫిర్యాదు చేస్తున్నా ఆసుపత్రి అధికారులు ఆ సిబ్బందిపై వారం లేదా 10 రోజులు సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నట్టే తీసుకుని తిరిగి వారికి జీవోటీ వద్దే పోస్టింగ్ ఇస్తున్నారు. జీవోటి వద్ద పోస్టింగ్ కావాల్సిన సిబ్బంది సంబంధిత అధికారులకు లేదా కాంట్రాక్టర్లకు రూ. 50 వేల నుంచి రూ. 1 లక్ష వరకు లం చాలు ముట్టజెబుతున్నారు. అంటే జీవోటి వద్ద రోజుకు ఎంత ఆదాయం వస్తుందో ఊహించవచ్చు. ఇందుకు ఉదాహరణ ఇటీవల జీజీహెచ్‌లో చోటుచేసుకున్న ఉదంతంతో అసహనానికి గురైన ఓ బాధితుడు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడమే. ఫిర్యాదులోని అంశాలు ఇలా ఉన్నాయి.

- (జీజీహెచ్ కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కలెక్టర్‌కు ఫిర్యాదు



తూర్పుగోదావరి జిల్లా, రంగంపేట మండలం నీలపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి సునీంద్రకు ప్రియాంకతో వివాహమై ఏడాది దాటింది. ఆమె గర్భం దాల్చడంతో కుటుంబీకులు జీజీహెచ్ గైనిక్ విభాగంలో చూపెట్టేవారు. ఆమెకు 9 నెలలు నిండి నొప్పులు వస్తుండడంతో ఆమెను కుటుంబీకులు ఈ నెల 14న జీజీహెచ్ లో జాయిన్ చేశారు. అదే రోజు ఆమెను జీవోటీకి తీసుకెళ్లేందుకు అక్కడ సిబ్బంది తొలుత రూ.500 తీసుకున్నారు. అనం తరం ప్రియాంకకు సిజేరియన్ ఆపరేషన్ జరిగి, ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం జీవోటీలో పని చేసే సిబ్బంది రూ. 3 వేలు డిమాండ్ చేశారు. అయితే ప్రియాంక కుటుంబీకులు మావద్ద అంత లేవని రూ.1500 ముట్ట చెప్పారు. మిగతా వాళ్ళ వద్ద కూడా రూ. 3 వేలు, రూ.4వేలు వసూలు చేసినట్లు బాధి తుడు సునీంద్ర తెలిపాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ దందాపై ప్రత్యేక విచారణ జరిపి బాధ్యులైన వారిని పూర్తిగా తొలగించి బాధితులకు న్యాయం చేకూర్చాలని సునీంద్ర కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నాడు.

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను అధికారులు సంతృప్తికరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాలులో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పురోగతిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పరిష్కరించిన అర్జీలను జిల్లాస్థాయి అధికారి ఆడిట్ చేసిన తర్వాత రాష్ట్రస్థాయిలో ఆడిట్ నిర్వహిస్తారన్నారు. ఒకే సమస్యపై పలుసార్లు వస్తున్న అర్జీలపై దృష్టి పెట్టాలన్నారు. బియ్యంకార్డు మంజూరు, కార్డులో పేర్లు మార్పులు, చేర్పులు పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు. రీసర్వే, ఆక్రమణల తొలగింపు, పారిశుధ్యం వంటి అంశాలపై 631 అర్జీలు వచ్చాయన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని వారు మీ కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, సీపీవో త్రినాథ్, జీజీహెచ్ ఎస్డీసీ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 55 అర్జీలు



బాధితురాలి గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో జిల్లావ్యాప్తంగా 55మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో వీసీ నిర్వహించి ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆ ఫిర్యాదులను పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 15 సివిల్, 18 కుటుంబ తగాదాలు, మరో 22 ఇతర సమస్యలు ఉన్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేస్తే సంబంధిత అధికారిపై వేటు తప్పదని ఎస్పీ హెచ్చరించారు.



మహా గణపతిం!



రేపటి నుంచి గణపతి నవరాత్రులు



21 పత్రాలు ఆరోగ్యమే

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడిని 21 రకాల పత్రాలతో పూజిస్తారు. అవన్నీ ఆరోగ్య ప్రదాయమే. ప్రధానంగా మాచీపత్రం, బృహతీపత్రం, బిల్వపత్రం, దూర్వాయియుగ్మం(గరిక), దత్తూర పత్రం, బదరీపత్రం, అపామార్గపత్రం, తులసీ, చూతపత్రం (మామిడి), కరవీరపత్రం, విష్ణుక్రాంత పత్రం, దాడిమి పత్రం, దేవదారుపత్రం, మరువకపత్రం, సింధువారపత్రం, జాజిపత్రం, గండకీపత్రం, శమీపత్రం, అశ్వత్థ పత్రం, అర్జునపత్రం, అర్కపత్రం(జిల్లేడు) ఉన్నాయని డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అందుబాటులో ఉండే ఈ పత్రాలు అన్నీ మానవ జాతికే కాదు సమస్త జీవరాశులకు ఎంతో మేలు చేకూరుస్తాయి. నవరాత్రుల అనంతరం ఆ పత్రాలను పంటకాల్వల్లో, నదుల్లో విడిచిపెట్టడం వల్ల ఆయా ప్రాంతాల్లోని చెడును దూరంచేసి శుద్ధమైన నీటిగా మార్చే శక్తి ఆ పత్రాలకు ఉన్నాయని తెలిపారు.

ఉత్సవ అనుమతులకు ఇలా చేయండి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

వినాయక చవితి ఉత్సవాల మండపాల ఏర్పాటు, ఊరేగింపుల నిర్వహణకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతులకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వ్యక్తులు ముందుగా కమిటీగా ఏర్పడి సింగిల్‌విండో విధానంలో అనుమతులు తీసుకోవాలి. ముందుగా ప్రభుత్వం ప్రకటించిన https://ganeshutsav.ne వెబ్‌సైట్‌కు వెళ్లి న్యూ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి. మొబైల్ నెంబర్ ఎంటర్ చేసిన తర్వాత ఓటీపీ వచ్చి నెంబర్ వెరిఫికేషన్ జరుగుతుంది.ఆ తర్వాతే దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది.దీనిలో దరఖాస్తుదారుడి పేరు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్, చిరునామా, కమిటీ పేరు, గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ పోలీస్ స్టేషన్ పరిధికి వస్తుంది, సబ్‌డివిజన్, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, గణేష్ నిమజ్జనం తేదీ, సమయం, విగ్రహం తరలించే వాహనం వివరాలు వీటిని ఎంటర్ చేసిన తర్వాత దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఇది జరిగిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది వచ్చి విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం కమిటీ సభ్యులు https://ganeshutsav.net/application Status పై క్లిక్‌చేసి నో అబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ), పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. డౌన్‌లోడ్ చేసిన ఎన్‌వోసీ, క్యూఆర్ కోడ్ లామినేట్ చేయించి మండపంలో ఉంచాలి. అధికారులు తనిఖీ చేస్తారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదు. రోడ్డుపై పందిళ్లు వేయడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం చేయకూడదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.అనుమతులకు ఒక పైసా చెల్లించనవసరం లేదు. ఉచితంగానే మంజూరు చేస్తారు.



రెడీగా.. గణేశుడు..

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వినాయక చవితి ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. ఎక్కడికి అక్కడ చలువ పందేళ్లు ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలు ముస్తాబు చేస్తున్నారు. చవితికి కేవలం రెండు రోజుల వ్యవధి ఉండడంతో విగ్రహాలను పందిళ్లకు తరలిస్తున్నారు. విగ్రహ సైజులను బట్టి రూ.3,500 నుంచి రూ.30 వేల వరకు ధరలు ఉన్నాయి. మార్కెట్లోని దుకాణాల్లో అయితే బుల్లి బొజ్జ గణపతి విగ్రహాలు రూ.50 నుంచి రూ.3 వేలు వరకు విక్రయిస్తున్నారు. మూడు అడుగుల ఎత్తు నుంచి 11 అడుగుల ఎత్తు గల విగ్రహాలు మార్కెట్‌లో ఉన్నాయి. మూడు నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం గమనార్హం. ప్రతి ఏరియాల్లో వ్యాపారం జరుగుతోంది. ఎందుకంటే వీధివీధినా గణపతులను ఏర్పాటు చేస్తారు. కొన్నిచోట్ల పందిళ్లను భారీ సెట్టింగ్‌లతో అదరగొట్టేస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు.



జాగ్రత్తలు నిబంధనలు..



- వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. విగ్రహాలు ఏర్పాటు చేసే సంబంధిత స్థల యజమాని, మునిసిపాలిటీ, కార్పొరేషన్లు, పంచాయితీ అధికారుల అనుమతులు తప్పనిసరి.
- అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి.నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలి.
- పందిళ్ల వద్ద అధిక వినిపించే సౌండ్ వినిపించే సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకూడదు. విద్యాసంస్థల, ఆసుపత్రులు, దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ ప్రచారం చేయకూడదు. అసభ్య ప్రదర్శనలు నిషేధం.
- రాత్రి వేళల్లో మండపాల వద్ద కాపలా ఉండాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిమజ్జనం పోలీసులు కేటాయించిన సమయంలో, మార్గంలోనే చేయాలి. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఊరే గించాలి. వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

మట్టి గణపతిని ఇంటి ఆవరణలో నిమజ్జనం చేయండి



మట్టి విగ్రహంతోనే పూజ చేయాలి.. పూజముగిసిన అనంతరం ఆ మట్టి విగ్రహన్ని పొలంలో కానీ.. ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేసుకోవాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసే గణపతి విగ్రహాలు ప్రమాదకరం. ఆ విగ్రహాలను నవరాత్రుల అనంతరం నదుల్లో, కాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల ఎన్నో జీవజాతులు ఆ నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నాయి.

-డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు

మొక్క రూపంలో నిత్యం దర్శించుకుందాం



మట్టి వినాయక ప్రతిమల వెనుకభాగంలో ఏర్పాటు చేసిన రంధ్రంలో నచ్చిన మొక్కకు సంబంధించిన విత్తనాలను వేసి కుండీలో నిమజ్జనం చేయాలి. వేసిన విత్తు మొక్కగా మారి పూలు, పండ్లతో పాటు ఆరోగ్యవంతమైన గాలిని అందిస్తుంది. అంతటా విస్తరించి ఉన్న పరమాత్ముడు మొక్క రూపంలో నిత్యం దర్శనం ఇస్తూనే ఉంటాడు కదా.

-బళ్ల దివ్యతేజస్వి, భట్లపాలెం, బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల

పర్యావరణ హితేశా.. గణేశా!

అమలాపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే పండుగల పరమార్థం. అందునా తొలి పూజ అందుకునే గణపతి నవరాత్రులు పర్యావరణ హితాన్ని బోధిస్తున్నాయి. శుద్ధ చవితి నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు మట్టినే తన రూపంగా మార్చుకుని పర్యావరణ హితబోధ చేసేందుకు ప్రతి ఇంటికీ లంబోదరుడు తరలిరానున్నాడు. చేసే ప్రతిపూజా ప్రకృతిని కాపాడేలా ఉండాలి. జీవకోటి మనుగడకు ఎటువంటి అవరోధం లేకుండా ఉండాలి. కానీ కాలక్రమంలో వచ్చిన ఆధునిక మార్పులతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో గణపతి విగ్రహాలను తయారు చేయడం, వాటిని నదుల్లో, ప్రధాన పంటకాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. ఎన్నో జీవరాశులకు ముప్పు వాటిల్లుతుంది. ఆలస్యంగానైనా యథార్థాన్ని గుర్తించారు. పూర్వపు మాదిరిగా మట్టి వినాయకుని ప్రతిమలను వినియోగిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు ఎందరో ముందుకు వచ్చారు. వారి కృషి ఫలించడంతో పాటు ఎక్కడికక్కడ వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు విరివిగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నాయి. ప్రతి ఇంట తొలిపూజలు అందుకునే లంబోదరుడి ప్రతిరూపాన్ని ఇంటి ప్రాంగణంలోని పూలకుండీల్లో నిమజ్జనం చేయడం అలవాటు చేసుకున్నారు. వినాయకుని పూజకు వినియోగించే 21 రకాల పత్రులు కూడా జీవకోటికి ఎంతో మేలు చేకూర్చేవే. ఇలా ప్రకృతి పురుషునిగా గణపతి నిలుస్తున్నారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లు

- 28న పరిశీలన ప్రక్రియ
- 25 బృందాలు ఏర్పాటు
- డీఎస్సీ మెరిట్ అభ్యర్థులకు సమాచారం
- పరిశీలకుడిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం



చేబ్రోలులో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం, ఆర్జేడీ నాగమణి, కాకినాడ డీఈవో రమేష్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ నెల 28వ తేదీన జరగనున్న ఈ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారికి కావాల్సిన ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలను సమకూర్చారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీఎస్సీ-2025 మెరిట్ జాబితాలో ఉండి సమాచారం ఇచ్చిన వివిధ కేటగిరీలకు చెందిన 1241 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచి జరగనున్నది. ఇందుకోసం కళాశాలలో 30 గదులను సిద్ధం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్‌లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. మరో ఐదు బృందాలను రిజర్వ్‌లో ఉంచారు. ప్రతి బృందం 50మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లతో వారు తీసుకువచ్చే ఒరిజనల్ సర్టిఫికెట్లలో కుల ధ్రువీకరణ పత్రాలను డిప్యూటీ తహసీల్దారు, మిగిలిన విద్యార్హతల సర్టిఫికెట్లను ఇతర టీమ్‌సభ్యులుపరిశీలిస్తారు.

ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఉమ్మడి జిల్లాకు పరిశీలకుడిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగాన్ని నియమించారు. ఆయనతో పాటు ఆర్జేడీ, ఉమ్మడి జిల్లా డీఈవోలు, డీవైఈవోలు, పరీక్షల ఏడీలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం చేసిన ఏర్పాట్లను విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం, ఆర్జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సోమవారం పరిశీలించారు. అక్కడ సిద్ధం చేసిన 30 రూమ్‌లు, ఏర్పాటుచేసిన ల్యాప్‌టాప్‌లు, వైఫై, ఇతర సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈని, బందోబస్తు నిమిత్తం గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణకు సూచనలు ఇచ్చారు. వారి వెంట గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, మల్లాం జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం గాజుల మురళీకృష్ణ వున్నారు.

మరోమారు...

డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చివరి క్షణంలో మరోమారు వాయిదా పడింది. తొలుత 25వ తేదీన నిర్వహిస్తామని ప్రకటించినా ఆదివారం రాత్రి ఈ ప్రక్రియను 26, 27 తేదీలకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయగా, వినాయకచవితిని దృష్టిలో ఉంచుకుని మళ్లీ వాయిదా వేయాలని రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకున్నారు. 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచే వెరిఫికేషన్ ప్రారంభిస్తామని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని డీఈవో రమేష్ కోరారు.

ఎంపికైన కానిస్టేబుళ్ళకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



కాకినాడ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు సోమవారం కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎంపికైన ఏపీఎస్పీ (మెన్), సివిల్ (మెన్ అండ్ ఉమెన్) మొత్తం 649 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు అన్నిటినీ పోలీసు అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఎస్పీ కార్యాలయ పరిపాలనాధికారి మూర్తి, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

తెలుగు భాషకు గుర్తింపు కోసం జాతీయ స్థాయిలో కృషి

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



తెలుగు భాషా సాహిత్య ఉత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు గుర్తింపు కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో వారం పాటు జరిగే డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగు భాషా సాహిత్య ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సానా సతీష్‌బాబు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం తెలుగు భాషా ఉత్సవాలు, భాషా సాహిత్య పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు భాషా స్ఫూర్తి నింపేందుకు సాహిత్య సృజనలో ఆసక్తి పెంచేందుకు చిరంజీవినీకుమారి భాషా సాహిత్య ఉత్సవ వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విద్యాలయాల్లో తెలుగు భాషను సజీవంగా నిలిపేందుకు పార్లమెంట్ వేదికగా కృషి చేస్తానన్నారు.

గౌరవ అతిథి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ తెలుగు భాషా ఉత్సవాల నిర్వహణ అభినందనీయమన్నారు. ఎంపీ సానా సతీష్‌బాబును ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, డాక్టర్ ఎన్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మెర్ల రంజిత్ సత్కరించారు. కథానిక రచన పోటీల్లో సుమారు 50 పాఠశాలలు, 11 కళాశాలల నుంచి 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 40 మంది తెలుగు ఉపాధ్యాయులను అతిథులు సత్కరించారు. అవధాని జి.వేంకట సత్య నరసింహ శాస్త్రి తెలుగు ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. 26, 28 తేదీల్లో పోటీలు జరుగుతాయని, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న జరిపే తెలుగు భాషా దినోత్సవం సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి వర్మ, కృష్ణంరాజు, శ్రీకాంత్, చింతపల్లి సుబ్బారావు, రచయితలు రవిమంత్రి, మాకినీడి, కేఎస్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ వి.కామరాజు, పీఆర్వో బీఎస్ఆర్ కృష్ణ, శ్రీనివాస్, కవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీపాదశ్రీవల్లభులకు లక్ష బిల్వార్చన

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో సోమవారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో ఐదో రోజు ప్రత్యేక పూజలు, శ్రీపాదుని దివ్య పాదుకలకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, గోపూజ, పల్లకీ సేవ జరిగాయి. రుత్విక్కులు, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య బిల్వార్చన సాగింది. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను విశేషంగా అలంకరించారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్విక్కులు



లక్ష బిల్వార్చన అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. పెళ్లి కోసం నేరం..

- ఇద్దరు పురుషులు ఇష్టపడి.. ఒకరు హిజ్రాగా మారాలని మరొకరి షరతు
- ఆపరేషన్ కోసం దొంగతనానికి ప్లాన్
- వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి బంగారు గొలుసు, గాజులతో పరారీ
- ఇద్దరిని అరెస్ట్ చేసిన తుని పోలీసులు



తునిలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ప్రియుడితో పెళ్లి కోసం హిజ్రాగా మారాలనుకున్నాడో వ్యక్తి. అయితే ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చవుతుండడంతో దొంగతనానికి ప్లాన్ చేశాడు. పక్క ఇంటిని టార్గెట్ చేసుకున్నాడు. ఆ ఇంట్లో వృద్ధురాలిపై ప్రియుడితో కలిసి దాడి చేసి బంగారం లాక్కుని పరారై చివరికి పోలీసులకు చిక్కారు.

తునిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ పోలీస్‌స్టేషన్లో సోమవారం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఈ కేసు వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన సతీష్ అలియాస్ అవంతికరెడ్డి 3 సంవత్సరాల క్రితం తుని వచ్చి స్థానిక హిజ్రాలతో కలిసి జీవిస్తున్నాడు. ఆడ లక్షణాలు ఉడడంతో రాత్రి వేళల్లో మహిళ వేషధారణలో జాతీయ రహదారిపై ఉంటూ పలువురిని ఆకరిస్తూ డబ్బులు సంపాదించేవాడు. అలాగే పండుగలు, జాతరలో డ్యాన్సులు వేస్తూ జీవనపాధి పొందేవాడు. అవంతికరెడ్డికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రశాంత్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో వారిద్దరూ తుని పదో వార్డులో నిమ్మకాయల వారి వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని భార్యాభర్తల్లా కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో అవంతిక రెడ్డి తనను పెళ్లి చేసుకోమని ప్రశాంత్‌ను కోరగా ఆపరేషన్ చేయించుకుని పూర్తిగా హిజ్రాగా మారితే తాను పెళ్లి చేసుకుంటానని ప్రశాంత్ చెప్పాడు. దీంతో ఆపరేషన్‌కు అవసరమయ్యే రూ.5 లక్షల కోసం అవంతిక రెడ్డి, ప్రశాంత్ దొంగతనానికి ప్లాన్ వేశారు. వారి ఇంటి పక్కనే ఉన్న వృద్ధురాలు బాలేపల్లి సత్యవతిపై దాడి చేసి బంగారం చోరీ చేయాలని నిశ్చయించుకున్నారు. ఈనెల 20న అర్ధరాత్రి దాటిన తర్వాత సత్యవతి ఇంటి వెనుక భాగంలో బాత్రూం వద్దకు రాగా అప్పటికే వేచి ఉన్న అవంతికరెడ్డి, ప్రశాంత్ ఆమె కళ్లల్లో కారం కొట్టారు. చేతులతో నోటిని మూసి మెడలో ఉన్న పగడాల బంగారు గొలుసుతో పాటు చేతికి ఉన్న 4 బంగారు గాజులను లాక్కుని పరారయ్యారు. దీంతో సత్యవతి తుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తుని సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో పలు కోణాల్లో దర్యాప్తు నిర్వహించిన పోలీసులు సత్యవతి ఇచ్చిన సమాచారం, ఇతర కోణాల్లో దర్యాప్తు ఆధారంగా దోపిడీ చేసింది అవంతికరెడ్డి, ప్రశాంత్ అని నిర్ధారించుకుని ఈనెల 24న కొండవారి పేటకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గెస్ట్ హౌస్ వద్ద వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 గ్రాముల పగడాల బంగారు గొలుసు, సుమారు నాలుగున్నర తూలాల బంగారు గాజులు, 2 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.7 లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన తుని సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐలు విజయ్, పాపారావు, సిబ్బంది యాదవ్, నాయుడు, శివయ్యను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

7న సత్యదేవుడి ఆలయం మూసివేత

ఈవో సుబ్బారావు

అన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 7న చంద్రగ్రహణం సందర్భంగా అన్నవరంలో సత్యదేవుడి ఆలయం మూసివేయనున్నట్టు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 10గంటల వరకు వ్రతం టిక్కెట్లు విక్రయించి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సర్వదర్శనములు నిలుపుదల చేసి తలుపులు మూసివేయడం జరుగుతుందన్నారు. తిరిగి 8వతేదీన సంప్రోక్షణ చేసి ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనాలు వ్రతాలు ప్రారంభమవుతాయని భక్తులు గమనించాలని కోరారు. 7వ తేదీ చంద్రగ్రహణం రాత్రి 9.50కి ప్రారంభమై 1:31 వరకు ఉంటుందని దేవస్థానం పండితులు తెలిపారు.

ఇద్దరి మధ్య ఘర్షణ... విడదీసేందుకు వెళ్లిన వ్యక్తిపై చాకుతో దాడి

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు గొడవ పడుతుండగా మధ్యలో విడదీసేందుకు వెళ్లిన వ్యక్తిపై చాకుతో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో జరిగింది. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద గ్రామానికి చెందిన నీలం లక్ష్మీ ప్రసాద్ గణపతి మండపం డెకరేషన్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం చెంతన గోళ్ల సాయి గణేష్, అగత్తి సాయి మధ్య ఘర్షణ ఏర్పడింది. గమనించిన లక్ష్మీ ప్రసాద్ ఇద్దరినీ విడదీసి సర్దిచెప్తున్న క్రమంలో గోళ్ల సాయి గణేష్ తన వెంట తెచ్చుకున్న చాకుతో గొంతు ఎడమ భాగంలో కోయడంతో రక్తపు గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ప్రియకుమార్ కేసునమోదు చేశారు.

మహిళపై కర్రలతో దాడి

నలుగురిపై కేసు నమోదు చేసిన పిఠాపురం రూరల్ పోలీసులు

పిఠాపురం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేసుకుంటున్న దళిత మహిళపై కర్రలతో దాడి చేసి సృహతప్పేలా కొట్టడంతో పాటు కులంపేరుతో దూషించిన నలుగురు వ్యక్తులపై పిఠాపురం రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పందిగరువు గ్రామానికి చెందిన కొత్తివేల మేరీ పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో 20 సెంట్లు పొలంలో సాగు చేసుకుంటుండగా తనపై కే.శివ, రాంబాబు తదితరులు దాడి చేసి కొట్టి గాయపరిచినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ జానీబాషా తెలిపారు. ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

అమలాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడిచేసిన కేసులో పులిదిండి వెంకట్రావుకు కోర్టు 14రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు లంకతోటకు చెందిన జల్లి మంగాదేవిపై అదే ప్రాంతానికి చెందిన పులిదిండి వెంకట్రావు ఈ నెల 21న దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనలో మంగాదేవి నాలుగు పళ్లు ఊడిపోయాయి. ఎస్ఐ మనోహర్ జోషి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దుస్తులు ఆరవేసుకునే విషయంలో జరిగిన ఘటనపై వెంకట్రావును అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండు విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

సత్యదేవుడి సన్నిధికి రూ.5 లక్షల విలువైన 2 ఫ్యాన్లు

ముందుకొచ్చిన దాత

అన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు వార్షిక కల్యాణమండపం వద్ద సేదతీరేందుకు రూ.5 లక్షల విలువైన 2 హెలికాప్టర్ ఫ్యాన్లను దేవస్థానానికి ఉచితంగా అందించేందుకు లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్ ముందుకొచ్చారు. సోమవారం సత్యదేవుడిని దర్శించిన ఆయన ఈ విషయంపై చర్చించి అంగీకరించారు. రెండురోజుల్లో ఈ ఫ్యాన్లను అమర్చనున్నట్టు దాత తెలిపారు.


ఫ్యాన్ల ఏర్పాటుపై ఈవోతో చర్చిస్తున్న దాత మట్టే సత్యప్రసాద్

ఏటీఎంలో చోరీకి యత్నం...
ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్


నిడదవోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిందితులపై 30 పాత కేసులు
సీఐ తిలక్

నిడదవోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నించిన అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేయడం ద్వారా 7 కేసులు ఛేదించినట్టు సీఐ పీవీజీ తిలక్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నం జరిగింది. నిడదవోలుకు చెందిన కోలా అభిషేక్, కోనసీమ జిల్లాకు చెందిన గుద్దటి రాజు ఈ చోరీకి ప్రయత్నించగా వారిని అరెస్ట్ చేశారు. పెందుర్తిలో 2, పాడేరులో 1, వి. మాడుగలలో 1, మండపేట రూరల్‌లో 1, రాజా నగరంలో 1, సమిశ్రగూడెంలో 1 మొత్తం 7 నేరా లు ఈ ఇద్దరు కలిసి చేసినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితులపై సుమారు 30 పాత కేసులు ఉన్నాయని, చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు బాలాజీ సుందరరావు, జగన్ మోహనరావు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై అక్టోబరు 7న జాతీయ సదస్సు



జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహణ
'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుసాహిత్యం -భాషాబోధన మనోవికాసం అనే అంశంపై అక్టోబరు 7న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని వై.ఎన్.కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. వై.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు డైరెక్టర్ పిట్టా శాంతి సోమవారం తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ విశ్వవిద్యాలయానికి వచ్చి వీసీని కలిశారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు వివరాలు తెలిపారు. అనంతరం వీసీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రాచీన సాహిత్యం, ప్రబంధసాహిత్యం, దక్షిణాంధ్రయుగ సాహిత్యం, శతకసాహిత్యం, ఆధునిక సాహిత్య ప్రక్రియలు, జానపద గిరిజన విజ్ఞానం, ప్రాథమిక, ఉన్నత విద్య, మాతృభాషాబోధన, వివిధ బోధనా పద్ధతులు వంటి బోధన మనోవికాసం ఉప అంశాలపై పరిశోధకులు పరిశోధనాపత్రాలను వైఎన్‌బిఇడిసెమినార్2025 జి.మెయిల్ డాట్ కామ్ అనే మెయిల్‌కు సెప్టెంబరు25లోగా పంపించాలని కోరారు. తెలుగుభాష, సాహిత్య ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహకులు పి.శాంతి, ముత్యాలకళ్యాణ రామకృష్ణారావు, సీహెచ్.రుద్రమదేవి, జి.రాధ, సీహెచ్.వరలక్ష్మి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రేవ్ పార్టీ..
కోనసీమ వాసుల అరెస్ట్!

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన రేవ్ పార్టీపై గచ్చిబౌలి పోలీసులు, ఈగల్ టీమ్ దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. అయితే అరెస్ట్ అయిన వారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ఇద్దరు యువకులు ఉన్నట్టు సమాచారం. వారిలో రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన తేజారెడ్డి, ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన విక్రమ్‌రెడ్డి ఉన్నట్టు భావిస్తున్నారు. వారు హైదరాబాద్‌లో నివాసముంటున్నట్టు తెలుస్తుంది. గతేడాది డ్రగ్స్ కేసులో విక్రమ్‌రెడ్డి ఉన్నారు. అయితే కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. హైదరాబాద్ డ్రగ్స్ లింక్‌లపై జోరుగా ఆ ప్రాంతంలో జోరుగా చర్చ జరుగుతుంది.

రెవెన్యూ అధికారి పేరు కూడా...

రాజమహేంద్రవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రేవ్ పార్టీ కేసులో రాజమండ్రికి చెందిన రెవెన్యూ అధికారి మణిదీప్ పేరు ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే దీనిపై ఆయన మాట్లాడుతూ నేను అసలు ఇటీవల హైదరాబాద్ వెళ్లలేదని, ఇక్కడే ఉన్నానని చెప్పారు. అయితే ఈ కేసుపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్‌ను ఆరా తీయగా తాము హైదరాబాద్ నుంచి సమాచారం కోరామని, రికార్డులన్నీ పరిశీలించి ఒక స్పష్టత తెస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు ఎంపిక

ఐ.పోలవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్స్ మహిళల జట్టును ఈనెల 27న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జి.వేమవరం జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ళ నాగరాం ప్రసాద్ తెలిపారు. ఈ నెల 30 నుంచి 31 వరకు పల్నాడు జిల్లా దూళిపాళ్ళలో జరిగే స్టేట్ సాఫ్ట్‌బాల్ మీట్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, అసోసియేషన్ ఐడీ కార్డు, జనన ధృవపత్రం తీసుకురావాలని ఆయన తెలిపారు.

లక్కవరంలో వ్యక్తి దారుణ హత్య

మంత్రగాడనే అనుమానంతో తల, మొండెం వేరు చేసిన వైనం

మోతుగూడెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు పోలీస్ సర్కిల్ మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల లక్కవరం గ్రామంలో నివసిస్తున్న మూట రామయ్య (45) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం సాయంత్రం దారుణంగా హత్య చేశారు. రామయ్య మంత్రగాడనే నెపంతో చంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల, మొండెంను వేరు చేసి తలను దగ్ధం చేసినట్టు తెలిసింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చింతూరు సీఐ గోపాలకృష్ణ, మోతుగూడెం ఎస్ఐ సాధిక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు తెలిపారు.


మూట రామయ్య మృతదేహం

డీఎస్సీ ఫలితాల్లో 'శ్యామ్' ప్రతిభ

శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణపొందిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు డైరెక్టర్ జి.శ్యామ్ తెలిపారు. డీఎస్సీ శిక్షణ ప్రారంభించిన మొదటి ప్రయత్నంలోనే వివిధ విభాగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు, జిల్లా ఫస్ట్ ర్యాంకులతో సంచలన విజయాలను సాధించారని వివరించారు. విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా శ్యామ్ అభినందించారు. ఆరు స్టేట్ ర్యాంకులతో పాటు స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా టాప్ ర్యాంకుల్లో పదిమంది అభ్యర్థులు విజయం సాధించారని శ్యామ్ పేర్కొన్నారు. ఎస్‌జీటీ విభాగంలో జిల్లా టాప్ ర్యాంకులు సాధించిన తొమ్మిది మంది అభ్యర్థుల వివరాలను కూడా శ్యామ్ వివరించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన వారిలో బి.హరీష్, బి.దిలేష్, వి.రమ్యశ్రీ, డి.బాలు నాయక్, ఎం.డేనియల్ కుమార్, సీహెచ్ భవాని ఉన్నారన్నారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్యామ్

పామాయిల్ తోట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమ పొలంలోకి అక్రమంగా చొరబడి 10 ఎకరాల విస్తీర్ణంలోని పామాయిల్ తోటను నరికేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు గ్రామానికి చెందిన మంక మల్లిఖార్జునస్వామి అలియాస్ మల్లిబాబు సోమ వారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్లిబాబు మాట్లాడుతూ కానవరం గ్రామానికి చెందిన సంగిశెట్టి వీరవెంకట్రావు అతడి అనుచరులు సోమవారం రాత్రి చొరబడి సర్వే నంబరు 298/6; 298/7; 298/8 నంబర్లలో 4.86 ఎకరాలు, ఎల్పీ నెంబరు 3159,306,3298, 3300,3585 సర్వే నంబర్లలో 5.25 ఎకరాల పొలంలో పామాయిల్ మొక్కలను రాత్రికి రాత్రి నరికేశారన్నారు. పంట నాశనం చేయడంతో పాటు బోరు మోటారు దొంగిలించి, పొలంలో పనిచేస్తున్న వ్యక్తులను తీవ్రంగా హింసించడమే కాకుండా తనను కూడా చంపుతానని బెదిరింపులకు గుర్తి చేస్తున్నారన్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.


ధ్వంసమైన పామాయిల్ తోట


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

13న జాతీయ లోక్ అదాలత్

ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి : పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి కృషి చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ని వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆ జిల్లాల ఈఎస్‌లు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో మేల్‌నర్సు సస్పెన్షన్

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళపై అకృత్యాలకు పాల్పడిన కాకినాడ జీజీహెచ్ మేల్‌నర్సు సస్పెన్షన్‌కు గురయ్యాడు. బాధితురాలు ఆదివారం కాకినాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదయ్యింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా, పత్రికల్లో వచ్చిన ఆధార సహిత వార్తల ఆధారంగా నర్సు మోకా సందీప్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు అధికారులు సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజంతా మద్యం మత్తులో ఉండడం, విధులకు కూడా మద్యం తాగి రావడం, నర్సు అయి ఉండి బాధితురాలి నగ్న ఫొటోలు ఆమెకు తెలియకుండా తీసి బ్లాక్‌మెయిల్ చేయడం, ఆమెపై దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడడం, ఆమె ఫొటోలను కన్న కొడుకుకు పంపి పైశాచిక ఆనందం పొందడం, ఆ మైనర్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించడం అంశాల ను ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చిన నేపథ్యంలో ఇవే అంశాల ప్రాతిపదికన సందీప్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. సందీప్‌పై విధించిన సస్పెన్షన్ సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. సందీప్ మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడని అతడితో పాటు పని చేస్తున్న మరికొంత మంది మేల్ నర్సులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ దిశగా దృష్టిసారించారు. ఇది ఇలా ఉంటే నిందితుడు సందీప్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


నిందితుడు సందీప్ (ఫైల్)

భర్త కళ్లెదుటే భార్య మృతి

మితిమీరిన వేగంతో వచ్చిన లారీ ఢీకొని ప్రమాదం
కాకినాడ వలసపాకల గంగరాజునగర్‌లో ఘటన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ని వెనుక నుంచి ఢీకొనడంతో లారీ చక్రం కింద పడి వివాహిత దుర్మరణం పాలైన సంఘటన సోమవారం కాకినాడ వలసపాకల గంగరాజునగర్ మెయిన్‌రోడ్‌లో జరిగింది. వివరాల్లోకెళితే కాకినాడ డెయిరీఫారమ్ సెంటర్‌కు చెందిన అరికిరెడ్డి సత్యనారాయణ, వెంకటరమణ (51) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు. సత్యనారాయణ తాపీపని చేస్తుంటాడు. అనారోగ్యంతో పనిలోకి వెళ్లడం లేదు. ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాలని భార్య కోరడంతో సోమవారం ఉదయం డెయిరీఫారమ్ సెంటర్ నుంచి టీవీఎస్-50 మోటార్‌సైకిల్‌పై తోడుగా భార్యను ఎక్కించుకుని వాకలపూడిలో గల కోరమండల్ ఆసుపత్రికి వెళుతున్నారు. మార్గం మధ్యలో వలసపాకల మెయిన్‌రోడ్డు గంగరాజునగర్ సూర్యకార్ వాష్ వద్దకు వచ్చేసరికి వెనకాల నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరత్నం పై నుంచి లారీ చక్రాలు తొక్కుకుంటూ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే భార్య మృతిచెందడంతో భర్త సత్యనారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు సర్పవరం ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తాటి బెల్లం వ్యాపారి అనుమానాస్పద మృతి

కరప, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన తాటి బెల్లం వ్యాపారి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తుతుక్కుడి జిల్లా అయ్యనరుతు మండల కేంద్రానికి చెందిన వెలువెత్తు మురుముత్తు (30), ముత్తు, అల్విన్, ముత్తయ్య పెరుమాళ్‌లు బొలేరో వ్యాన్‌లో పలు రాష్ట్రాల్లో తాటి బెల్లం అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా పదిరోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చిన వారు ఈనెల 24న కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులో తాటి బెల్లం విక్రయించారు. రాత్రికి స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్ద బొలేరో వాహనాన్ని నిలిపి అందులోనే మద్యం సేవించి, భోజనం చేసి నిద్రపోయారు. సోమవారం ఉదయం పెరుమాళ్ ముత్తయ్య టీ పట్టుకుని వచ్చి వెలువెత్తు మురుముత్తును ఎంతలేపినా నిద్రలేవలేదు. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. పెరుమాళ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

కోడిపందాలు ఆడుతున్న 13 మంది అరెస్ట్

రూ.35 వేల నగదు, 3 కోళ్లు, 16 కార్ల స్వాధీనం

నల్లజర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల బైపాస్ పక్కనే కోడిపందాలు నిర్వహిస్తున్న బృందంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో సీఐ బాలచౌరి సిబ్బందితో దాడి చేసి 13 మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.35 వేల నగదు, 3కోళ్లు,16 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేస్తున్నారనే సమాచారం పందెం రాయుళ్లకు చేరడంతో అనేకమంది పారిపోయారు. కార్లలో వచ్చిన వారు తప్పించుకునే మార్గం లేకపోవడంతో పోలీసులకు చిక్కారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పెద్దాపురంలో రక్తదాన శిబిరం

పెద్దాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాళ్లూరి వారి సత్రంలో సాయి సేవ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 130 మంది రక్తదానం చేశారు. అద్దేపల్లి లక్ష్మణరావు, వేణుగోపాలకృష్ణ, సునీల్, పసువర్తి రవి, నానాజీ, పాబోలు ప్రసాద్, కేఎస్ఎన్ మూర్తి, నాగేంద్ర, కరెడ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న విద్యా శాఖ అడిషినల్ డైరెక్టర్ రామలింగం

ఇంటి నుంచి భోజనాలు తెచ్చుకుంటున్నారా!

చేబ్రోలు హైస్కూల్‌లో మిడ్డేమీల్స్‌ను తనిఖీ చేసిన విద్యా శాఖ అడిషినల్ డైరెక్టర్

వండే బాధ్యతను డ్వాక్రా గ్రూపులకు అప్పగించాలని ఆదేశం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్నా విద్యార్థులు ఇంటి నుంచే బాక్సుల్లో భోజనాలు తెచ్చుకుని తినడంపై విద్యా శాఖ అదనపు డైరెక్టర్ మువ్వా రామలింగం ఆరా తీశారు. సోమవారం ఆయన ఆర్జేడీ నాగమణితో కలిసి గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యారులు మిడ్డే మీల్స్‌లో వచ్చిన పదార్థాలను తినడానికి ఆసక్తి చూపకపోవడాన్ని ఆయన గుర్తించారు. పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు ఏజెన్సీని మార్చి తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు స్థానిక డ్వాక్రా గ్రూపులకు అప్పగించాలని హెచ్ఎంను ఆదేశించారు. అనంతరం దుర్గాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, హెచ్ఎంలు సూర్యప్రకాష్, విజయదుర్గ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

వినాయక చవితి ఉత్సవాలపై ఆంక్షలు వద్దు

భక్తి శ్రద్ధలతో సంప్రదాయంగా జరుపుకుందాం: విశ్వహైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని విశ్వహైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పిఠాపురంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ, బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో గణేష్ ఉత్సవాలను కుల, ప్రాంతాలకు అతీతంగా నిర్వహించుకోవాలని సూచించారు. వినాయకచవితి ఉత్సవాలకు ఎటువంటి ఆంక్షలు పెట్టవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికుమార్, నాగాభట్ల లక్ష్మణశర్మ, బూరి సురేంద్రదత్త, ఈశ్వరరావు, అరిగెల ప్రసాదరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జై గణేష్ మాలధారణకు వచ్చిన భక్తులు

ఘనంగా జై గణేష్ మాలధారణ

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగుమ్మం సెంటర్లో వేంచేసియున్న జైగణేష్ దేవస్థానంలో సోమవారం గణపతి మాలధారణ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి 400మందికి పైగా భక్తులు మాల ధరించారు. అంతకు ముందు అంకురార్పణం, ధ్వజారోహణం, పుణ్యహవాచనం, స్వామికి అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఫైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు జరగ్గా ఆలయ ఈవో నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సిరిపురంలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సర్పంచ్ సుజాతవీరబాబు

పేద విద్యార్థులకు సైకిళ్ల అందజేత

కరప, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఓంసాయి మెరైన్ కంపెనీ అధినేతలు నున్న రామచంద్రరావు, సూర్యనారాయణమూర్తి సహకారంతో మండలంలోని సిరిపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులు పది మందికి సైకిళ్లు అందజేసినట్టు సర్పంచ్ నున్న సుజాతవీరబాబు తెలిపారు. గ్రామాభివృద్ధికి, యువతకు అవసరమైన సేవలందిస్తామని కంపెనీ అధినేతలు హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఓంసాయి మెరైన్ కంపెనీ సేవా కార్యక్రమాలను సర్పంచ్, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఆరోగ్య కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి లక్కీ డిప్ ద్వారా గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలను డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం అందజేశారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఎల్‌టీవో డాక్టర్ ఐ.ప్రభాకర్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ వి.అరుణ, డీపీఎంవో డాక్టర్ జి.లక్ష్మి, పెద్దాపురం డీఎస్‌వో డాక్టర్ ఎన్.ప్రశాంతి, డీఎంవో డాక్టర్ విల్సన్, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

కలెక్టరేట్ ఎదుట ధర్నాల హోరు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, గంగా సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, ప్రత్తిపాడు, కోటనందూరు మండలాల్లో జూనియర్ కళాశాలలకు భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. జిల్లాలోని వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్ధు, సాహిత్, వాసుదేవ్, నాగరాజు, మణికంఠ, ఉదయ్‌కుమార్, జయరాము, సత్యం, చిన్ని, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు మండల పరిధిలో 216 జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించాలని తాళ్లరేవు మండల అఖిలపక్ష ప్రజా సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రతినిధులు బాబూరావు, ఈశ్వరరావు కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పెన్షనర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఏ శాస్త్రి, కె.సత్తిరాజు మాట్లాడుతూ ఏపీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2018 నుంచి పెండింగులో ఉన్న డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, అర్జిత సెలవుల నగదు, పీఆర్సీ బకాయిలు రూ.20కోట్లు చెల్లించాలని కోరారు. గత 8నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ తక్షణం చెల్లించాలన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. గౌరవాధ్యక్షుడు అజయ్‌కుమార్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు రజకులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కోనేటి రాజు మాట్లాడుతూ రైల్వే, ఆసుపత్రులు, ఆర్టీసీ, పోలీసు శాఖల్లో రజకులకు కేటాయించిన పోస్టులను తక్షణం భర్తీ చేయాలన్నారు. 50 ఏళ్ల నిండిన రజకులకు పింఛను సదుపాయం కల్పించాలన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సీహెచ్ శ్రీనివాస్, కొడమంచిలి అప్పన్న, దమరసింగు దుర్గ, సామంతకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వేట అవకాశం కల్పించాలి

అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు సముద్రంలో వేట విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి అంతర్వేది, గొల్లపాలెం, విశాఖ ప్రాంతాల్లో వేటకు అవకాశం కల్పించాలని వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఇతర ప్రాంతాల్లో వేటకు వెళ్లనివ్వకుండా తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, వైసీపీ హయాంలో మొదలైన ఈ విధానాన్ని మార్చు చేయాలని కోరుతూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాదు, మూలపేట తదితర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం కాకినాడలో మంత్రిని కలిశారు. తమ ఇబ్బందులను వివరించారు. అక్కడ నుంచే మంత్రి ఫిషరీస్ కమిషనరు, ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఇక్కడ మత్స్యకారులకు అన్ని ప్రాంతాల్లో వేట చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



మత్స్యకారుల సమస్యలను మంత్రికి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, మత్స్యకార సంఘాల నాయకులు

అంతకుముందు హార్బర్ వద్ద రోడ్డు విషయంలో కలెక్టర్ షాన్‌మోహన్‌ను వారు కలిశారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.25లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వర్మ తెలిపారు. నాయకులు సూరాడ రాజు, అప్పన్న, సనపయ్య, ప్రసాద్, విఘ్నేష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఆలయ కొత్త పాలకవర్గ ప్రమాణస్వీకారం

కాకినాడ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్‌లోని ప్రసిద్ధ వినాయకుని ఆలయ కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా జి.చిట్టిబాబు, సభ్యులుగా పోలిపల్లి జగన్, ఎంవీవీ శ్రీనివాసరావు, వి.శ్రీదేవి, ఎన్.వెంకటలక్ష్మి, పందిరి సూర్యకుమారి, నరం శ్రీనివాసరావు, పట్నాల వెంకటరమణ, పేరూరి మాధవమహాలక్ష్మిలతో దేవదాయ శాఖ తనిఖీదారు ఫణికుమార్, ఆలయ ఈవో మురళి వీరభద్రరావు ప్రమాణం చేయించారు. కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, పసుపులేటి వెంకటేశ్వరరావు, గుజ్జు లక్ష్మణరావు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, గోపిశెట్టి బూరయ్య, ఆలయ అర్చకుడు దువ్వూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నేమాం దళితవాడలోని రామాలయానికి భక్తుల కోరిక మేరకు మైక్ సెట్‌ని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ నిర్వాహకులకు అందజేశారు. హిందూ పరిరక్షణ పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు నండూరి సత్తిబాబు, బి.రామకృష్ణ, పెద్దాడ సుబ్బారాయుడు, వి.సుబ్బారాయుడు, కందికట్ల శివశంకర్, కండిలి వెంకట్, ఉమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'బర్మా కాందిశీకుల సొసైటీ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరం గ్రామ పంచాయతీ సర్వే నెం.108 పరిధిలోని 6 ఎకరాల కాందిశీకుల సొసైటీ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు వినతులు ఇచ్చినా ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రభుత్వ సహకారంతో ఈ భూమిని సొంతం చేసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

త్రిరత్న బౌద్ధ దమ్మ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక

తాళ్లరేవు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండల త్రిరత్న బౌద్ధ దమ్మ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక వ్యవస్థాపకుడు ఉపాసక పి.నరసింహమూర్తి అధ్యక్షతన, రాష్ట్ర కన్వీనర్ గిడ్ల వరప్రసాద్ సారథ్యంలో పోలేకుర్రులో సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా జక్కల ప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షుడిగా కూరాటి రామారావు, కార్యదర్శిగా గుత్తాల సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పినిపే నాగేంద్రరావు, సభ్యులను ఏకగ్రీవంగా అందుకున్నారు. అనంతరవ వారు బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించి సొసైటీ బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

కురసాల సత్యనారాయణకు నివాళి

కరప, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో సోమవారం వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుని ఆయన మృతికి సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సంతాప సభలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, జడ్పీటీసీలు యాళ్ల సుబ్బారావు, నురుకుర్తి రామకృష్ణ, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల శాఖ అధ్యక్షుడు రొక్కాల గణిరాజు, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమన్న, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతికుమార్, కమిడి మంగాదేవిశంకర్, నాయకులు బండే తాతాజీ, నక్కా భద్రం, బండారు వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి చందు, చోడిశెట్టి చంటి, బండారు సతీష్, నక్కా సత్తిబాబు, గోన శ్రీను, రావుల ప్రసాద్, మారెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, సోడగం సూరిబాబు, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులకు పూజించి పర్యావరణాన్ని కాపాడదామని పిలుపునిస్తూ పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మట్టి గణనాథులను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాషిణి, ఎకో క్లబ్ కన్వీనర్ ఉషశ్రీ, కెమిస్ట్రీ అధ్యాపకులు ఆనంద్, అనంతలక్ష్మి, ఎకో క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): చెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయంగా మట్టి వినాయకులను తయారు చేసి గ్రామస్తులకు అందజేశారు. హెచ్ఎం సతీష్‌కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు, విద్యాకమిటీ చైర్మన్ జగ్గారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): వినాయకచవితిని పురస్కరించుకుని కొత్తపల్లి వీవీఎస్ విద్యాసంస్థల విద్యార్థులు సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల సిబ్బందికి, ప్రయాణికులకు, పాదచారులకు విగ్రహాలను అందజేశారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ హాల్లో సుమారు 600 మట్టి వినాయక ప్రతిమలను క్లబ్ సభ్యులకు, భక్తులకు లయన్స్ క్లబ్ మెంటార్ డాక్టర్ బాదం బాలకృష్ణ సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇబా అధినేత కొమ్మిశెట్టి కుమార్, జగన్నాథరావు, పి.కుమార్, మురళీకృష్ణ, కృష్ణారావు పాల్గొన్నారు.

కాకినాడ క్రైం (ఆంధ్రజ్యోతి): ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో న్యాయవాదులకు మట్టి వినాయక ప్రతిమ, వినాయక వ్రత కథ పుస్తకాన్ని పంపిణీ చేశారు. సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ, కార్యదర్శి చక్కపల్లి చంటి, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో, బోట్‌క్లబ్ అన్నా క్యాంటీన్, కాకినాడలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మట్టి వినాయక ప్రతిమలను లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు శ్రీదేవిరెడ్డి, అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సురేఖ పంపిణీ చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ అమలకంటి శ్రీనివాస్ సుమారు 500 మట్టి గణపతి ప్రతిమలను పలువురికి పంపిణీ చేశారు. కర్రి ఆదినారాయణరెడ్డి, మోహనరావు మాస్టారు, పడాల వీరబాబు, మంగరాజు, ఏలేటి రమేష్, నల్లా చక్రధర్ (బుల్లియ్య) తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): భానుగుడి సమీపాన క్లబ్ సభ్యుడు బదిరెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్ రావు ప్రారంభించారు. రోటరీ వృద్ధాశ్రమ కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్, రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి మాచారెడ్డి, జీకే శ్రీనివాస్, లంక సాయిబాబు, ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వాతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం హైస్కూలు విద్యార్థులు తయారుచేసిన 100 మట్టి వినాయక ప్రతిమలను ప్రధానోపాధ్యాయుడు మొండి వీరబాబు పలువురికి పంపిణీ చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, రాజరాజేశ్వరి అభినందించారు.

డీఎస్సీలో శ్వేతకు 16వ ర్యాంకు



కరప, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో కరప గ్రామానికి చెందిన జెల్లా శ్వేత 16వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి మాధవరావు వ్యవసాయ కూలీ కాగా తల్లి రత్నకుమారి కరప పీహెచ్‌సీలో ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. నిరుపేద కుటుంబానికి చెందిన శ్వేత చదువులో ఎప్పుడూ ముందుండేది. ఆర్థిక స్తోమత లేక పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం గోపాలపురంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రోత్సాహంతో కాకినాడలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి వద్దే ఉంటూ డిగ్రీ డిస్టెన్స్ సాధించింది. తల్లిదండ్రుల కష్టాన్ని చూడలేని శ్వేత ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో ఎటువంటి కోచింగ్ లేకుండా రెండేళ్లపాటు కఠోర శ్రమతో చదివి ఇప్పుడు డీఎస్సీలో మెరిసింది. శ్వేతను పలువురు అభినందించారు.



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనరు భావన

'సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పౌరుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు జరిగిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ఫోన్ ద్వారా, ప్రత్యక్షంగా 22కి పైగా అర్జీలు స్వీకరించారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసరావు, హెల్త్ అఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ సీతారాం, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మరిడమ్మ హుండీల ఆదాయం రూ.13.98 లక్షలు

పెద్దాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలోని హుండీలను దేవదాయ, ధర్మదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారుల సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 34 రోజులకు రూ.13,98,965 ఆదాయం లభించిందని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ అధికారి విళ్ల పల్లంరాజు, సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 53 అర్జీలు

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 53 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను పీడీ ఎ.చైత్రవర్షిణి స్వీకరించారు. ఏపీడీ వసంత మాధవి, మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'పీజీఆర్ఎస్'కు అర్జీ

గండేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు దివ్యాంగ పింఛను రద్దు చేయడంపై అర్జీ వచ్చినట్టు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, వెంటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఏపీఎం సన్యాసిరావు తదితరులున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 95 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ ప్రజల నుంచి 95అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. రంపచోడవరంలో ఆదివాసీ మ్యూజియం, రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని, పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికంగా దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ పి.అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్ షఫ్, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, డీఎల్‌పీవో కెకోటేశ్వరరావు, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం జయశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో 1/70 చట్టం అమలుకు చర్యలు: పీవో

రంపచోడవరం,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో1/70చట్టాన్ని పటిష్టంగా అమలుకు చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణతో కలిసి వివిధశాఖల అధికారులు, ఇంజనీర్లతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ ఈనెల26నుంచి సెప్టెంబర్ 2వరకు అక్రమ కట్టడాలు నివారించేందుకు గిరిజన సంఘాలు, ప్రతినిధుల నుంచి దరఖాస్తులను స్వీకరించి నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామన్నారు. గిరిజనప్రాంతంలో అక్రమ కట్టడాలు నిర్మూలించేలా అధి కారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, తహసీల్దారు బాలాజీ, డీఈ పి.వెంకటరమణ, ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.

'ఆదికర్మయోగి'పై వక్రీకరణ తగదు: పీవో

రంపచోడవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సమగ్ర అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఆదికర్మయోగి అవగాహన కార్యక్రమాన్ని వక్రీకరించడం తగదని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఆదివాసీ గ్రామాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఆదికర్మయోగి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, రాష్ట్రంలో 20లక్షల మందిని ఆదికర్మయోగిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే వ్యక్తిగత టాలెంట్‌ను గుర్తించేందుకు కొన్ని ఎక్టివిటీస్, పజిల్స్, మెంటల్ ఎబిలిటీ, పాటలు, నృత్యాలు తదితర కార్యక్రమాలు బ్లాక్‌లెవెల్ అధికారులు శిక్షణలో భాగంగా సిబ్బందికి చేసి చూపించి అవగాహన కల్పిస్తే దానికి అధికారులు డ్యాన్స్ చేశారని వక్రభాష్యం చెప్పడం సరికాదన్నారు. ఆదికర్మయోగి కార్యక్రమం అధికారికంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో జరిగిందని, అధికారులు ఎవరు పొరపాటు చేయలేదని, కార్యక్రమంలో ఎక్కువ శాతం ఆదివాసీ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని పీవో పేర్కొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక బోధన

రంపచోడవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన పాఠశాలల్లో చదువుతోన్న పదో తరగతి విద్యార్థులను సూపర్ 50 కార్యక్రమం ద్వారా ఎంపిక చేసి ప్రత్యేక విద్యను బోధించేలా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఏజెన్సీలో 35పాఠశాలల్లో చదువుతోన్న 255మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించామని, ఎక్కువ మార్కులు సాధించిన 50మంది బాలబాలికలను ఎంపిక చేశామన్నారు బాలురకు దేవరపల్లి గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో, బాలికలకు కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమశాఖ బాలికల పాఠశాలలో ప్రత్యేక విద్యను బోధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యువోలు కృష్ణమోహన్, నాగజ్యోతి, మండల విద్యాశాఖాధికారి రమేష్, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ ఏవో బి.కిషోర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

దేవీపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎస్.రామన్నపాలెంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ప్రసంగించారు. పెరుగుతోన్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని వివరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. వినాయక చవితి ఉత్సావాల నేపథ్యంలో గణేష్ మండపాల నిర్వాహకులు నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పశువైద్యాధికారి విధులకు గైర్హాజర్‌పై నేడు విచారణ

దేవీపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇందుకూరపేట పశువైద్యశాల వైద్యాధికారి విధులకు హాజరుకాకపోవడంపై వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం అధికారులు విచారణ చేయనున్నారు. జీతం తీసుకుంటూ రెండేళ్లుగా విధులకు హాజరుకాకపోవడంపై ఈనెల21న ఐటీడీఏ కార్యాలయంలో గ్రామానికి చెందిన పాడిరైతు ఒమ్మి అప్పలరాజు, పారా లీగల్ వలంటీర్, ఆదివాసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు పటమటి లక్ష్మణారావు, కుండ్ల సాయిరాం రెడ్డి ఫిర్యాదుచేశారు. దీనిపై పీవో విచారణకు ఆదేశించారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి వైసీపీకి లేదు

వీఆర్‌పురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు లేదని టీడీపీ సీనియర్ నాయకుడు బొర్ర నరసింహరావు అన్నారు. సోమవారం రేఖపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదలప్పుడు బాధితులకు నిత్యావసరాలు అందించలేదని ఆరోపణలు చేయడం సరికాదని, 2022లో వచ్చిన వరదలకు వైసీపీ ప్రభుత్వం బాధితులకు రూ.2వేలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. అప్పట్లో వరద బాధితులకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సహాయ సహకారాలు అందించామని ఆయన తెలిపారు. గత ఏడాది వరదలకు మండలంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో అన్ని కుటుంబాలకు రూ.3వేలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కు తుందన్నారు. పోలవరం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, నాయకులు ముత్యాల సిద్ధార్థ, బొర్ర సూరి బీరక ప్రకాశరావు, ముత్యాల చంద్రశేఖర్, బొర్ర ఆది, కోట్ల అప్పాజీ, ముత్యాల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏబీపీఎంకు ఉత్తమ అవార్డు

చింతూరు ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో అత్యధిక లబ్ధిదారులను నమోదు చేసినందుకు చింతూరు సబ్‌పోస్టాఫీస్ పరిధి అభిచర్ల అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ అల్లి శ్రీనివాసరావుకు ఉత్తమ అవార్డు లభించింది. సోమవారం పోస్టల్ సూపరిండెంటెంట్ శేషారావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అబ్దుల్లా నుంచి ఆయన అవార్డును అందుకున్నారు. ఇటీవల పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన పోస్టల్ ఉద్యోగస్తులకు బహుమతులను ప్రదానం చేశారు.

సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపసర్పంచ్

ఎటపాక, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నందిగామ తాత్కాలిక సర్పంచ్‌గా ఉపసర్పంచ్ పులుసు బాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ ఇంగిలపు బేబీ ఇటీవల వ్యక్తిగత పనులపై విదేశాలకు వెళ్లారు. ఆమె తిరిగి 2026జనవరిలో వస్తారు. ఈవిషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తీసుకెళ్లారు. ఉపసర్పంచ్ బాలకృష్ణను తాత్కాలిక సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. బాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఇదేం పని...?

• ధర్మవరంలో ఆసుపత్రి మందుల అవశేషాల డంపింగ్
• కలుషితమవుతున్న వాతావరణం
• గ్రామస్తుల ఆందోళన



ధర్మవరం పుంత మార్గంలో డంపింగ్ చేసిన మందుల అవశేషాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఆసుపత్రులకు చెందిన మందుల అవశేషాలను డంపింగ్ చేస్తున్నారు. వేకువజామునే వాహనాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చినచెరువు, గ్రామ పుంత మార్గాల్లో ఈ మందుల అవశేషాలతో కూడిన చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో మందులు, సెలైన్ల బాటిల్స్, గుడ్డలు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వల్ల దుర్వాసన వస్తోంది. వాతావరణం కాలుష్యం అవుతుంది. చెరువు వద్దకు తాగునీటి కోసం వచ్చే పశువులను తీసుకొచ్చేవారు పుంత మార్గాల గుండా రాకపోకలు సాగించే రైతులు ఈ అవశేషాలు తమకు ప్రమాదకరంగా మారతాయని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రుల చెత్తా చెదారాలను గ్రామాల్లో డంపింగ్ చేయడం ఏంటని ప్రజలు నిలదీస్తున్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి ఆసుపత్రి వ్యర్థాలు డంపింగ్ చేసి ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జడ్జి



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి గోపీనాథ్

ప్రత్తిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని స్థానిక మేజిస్ట్రేట్ ఎల్.గోపినాథ్ ప్రారంభించారు. జడ్జితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజాల చిట్టిబాబు, ఏజీపీ రవీంద్రమోహన్, న్యాయవాదులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. జడ్జి గోపినాథ్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం ఎప్పుడకప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం అత్యవసరమన్నారు. ఈ శిబిరంలో కాకినాడ టైనోవా ల్యాబ్ సిబ్బంది న్యాయవాదులకు రక్తన మూనాలు సేకరించి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు బి.నాగేంద్రరాజు, కె. శ్రీనివాస్, జి.కామేష్, బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు కె.వీరరాజు, సీహెచ్ రామకృష్ణ, బుగతా శివ, జేవీఆర్ విజయ్‌కుమార్, న్యాయవాదుల అచ్యుతరావు, ఎవెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు, దేవి, మంజూషా, సీతారామరాజు, వెంకట రెడ్డి, మూర్తి, జోగేష్, స్వామి, జాన్‌బాబు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న జ్యోతుల లక్ష్మీదేవి, అనీష్ నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్‌లో ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగేళ్లుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. సోమవారం రాజమండ్రికి చెందిన చక్కపల్లి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమార్తె, అలుడు, మనవడు జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి, అనీష్ నెహ్రూ ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జంపన రవి వర్మ, వేములకొండ జోగారావు, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం) దాపర్తి సీతారామయ్య, దేగల సత్తిబాబు, అరటా పోలీస్, షేక్ వల్లి, మారిశెట్టి గంగ, పుర్రె వీరబాబు, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను తొలగించాలని ధర్నా

ఏలేశ్వరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కమిషనర్‌ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాలని సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏసీబీ దాడిలో లంచం తీసుకుంటూ పట్టుబడిన కమిషనర్ సత్యనారాయణను కఠినంగా శిక్షించి, తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని నగర పంచాయతీ అధికారులకు వారు వినతి పత్రం అందజేశారు.



ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

మట్టి వినాయకుడిని పూజిద్దాం



ఏలేశ్వరంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు



గండేపల్లి: ఆదిత్య యూనివర్సిటీలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ దృశ్యం

ఏలేశ్వరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మట్టి ప్రతిమలే శ్రేయస్కరమని మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు అన్నారు. సోమవారం స్థానిక మార్స్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్, డిజైన్స్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు దుర్గారావు నేతృత్వంలో సుమారు రూ.10వేల ఖర్చుతో ఉచితంగా 1008 మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. బాటసారులకు అందజేశారు. కోరాడ రాజు, కటకం కిరీటి, ప్రగడ మధుబాబు, కర్రి చైతన్య, నూకరత్నం, వెంకీ, రత్నం, చంటిబాబు, ఉడతల రమణారావు తదితరులున్నారు.

గండేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్‌లో శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి పెద్దబ్రహ్మదేవం సభ్యుల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితికి పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించి అందరూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి అధ్వర్యంలో సమితి సభ్యులు, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది సహకారంతో 16 ఏళ్ల నుంచి ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేస్తున్న సభ్యులను డాక్టర్ ఎస్.సతీష్ రెడ్డి, ఎం.ఎస్.రెడ్డి అభినందించారు.

వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రత్తిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు తల మునకలయ్యాయి. దీనిలో భాగంగా ధర్మవరం, ఒమ్మంగి పెద్దిపాలెం, శరభవరం తదితర గ్రామాల్లో చేతివృత్తిదారులు మట్టి గణపతి విగ్రహ ప్రతిమల తయారీ చేపట్టి అమ్మకాలకు సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు వినాయక చవితి ఉత్సవాలపై గ్రామ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. వినాయక విగ్రహాల నిమజ్జన ప్రదేశాల వద్ద విద్యుత్ సౌకర్యం, శానిటేషన్ చర్యలు తీసుకోవాలని ఆయన కార్యదర్శులకు సూచించారు.





ధర్మవరంలో మట్టి గణపతులు, ప్రత్తిపాడులో మండపం పనుల దృశ్యాలు

స్తంభం సరిచేశారు...

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

రౌతులపూడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గిడజాం గ్రామశివారు పొలాల్లో విద్యుత్ స్తంభాన్ని అధికారులు సరిచేశారు. ఈ స్తంభం ప్రమాదకరంగా ఒక పక్కకు వాలిపోవడంతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. పొలాల్లో పక్కకు ఒరిగి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న స్తంభాన్ని సరిచేశారు.

ఎంపీటీసీకి మాతృవియోగం

ప్రత్తిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడికి చెందిన ఎంపీటీసీ పిల్లా కొండలరావు(చిన్న) మాతృవియోగానికి గురయ్యారు. చిన్న తల్లి మణెమ్మ (65) తీవ్ర టైఫాయిడ్ జ్వరంతో సోమవారం ఉదయం కన్నుమూశారు. వైసీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఎంపీటీసీ చిన్న కుటుంబాన్ని పరామర్శించారు.

'ప్రగతి'లో వర్క్‌షాప్

గండేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల డేటా సైన్స్ విభాగం స్టూడెంట్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో బి.టెక్ డేటా సైన్స్ విద్యార్థులకు బ్రెయినీవిజన్, హైదరాబాద్ వారి సహకారంతో మెర్న్ స్టాక్ టెక్నాలజీస్ ఫర్ బిల్డింగ్ డేటా- డ్రైవన్ వెబ్ యాప్స్ అంశంపై ఈ నెల 25 నుంచి 3రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని కళాశాల చైర్మన్ కృష్ణారావు తెలిపారు.

గణేష్ ఉత్సవాలకు ఆహ్వానం

జగ్గంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ డిపో పక్కన సితార సెంటర్లో దూండి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ నేతృత్వంలో ఈనెల 27న శ్రీ కార్యసిద్ధి మహాశక్తి గణపతి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు ఎంపీలు సానా సతీష్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీ పి.రాజశేఖర్, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, పంతం నానాజీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జ్ వర్మ తదితరులను ఆహ్వానించమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు పేర్కొన్నారు.

షార్ట్ ఫిలిం విడుదల చేసిన ఎమ్మెల్యే నెహ్రూ



జగ్గంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం మల్లవరానికి చెందిన మరిసే దుర్గాప్రసాద్ జీరో బ్యాలెన్స్ షార్ట్ ఫిలిం తెరకెక్కించాడు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా క్యాంప్ ఆఫీసులో విడుదల చేశారు. కార్యక్రమంలో జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, మల్లవరం సర్పంచ్ యిడుదుల అర్జునరావు, రాయి సాయి, మరిసే సత్యనారాయణ, యిడుదుల సూరిబాబు,యిడుదుల వీరబాబు, ఇంటి గణేష్, అందే రాజీవ్ తదితరులున్నారు.

ఓపెన్ స్కూల్ ఫీజు గడువు పెంపు

రౌతులపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి ఫీజు గడువు పెంచినట్టు ఎంఈవోలు కన్నూరు సతీష్‌బాబు, గాడి కొండబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసినవారు 14 ఏళ్ల వయస్సు దాటిన వారు నేరుగా పదోతరగతి, 16 దాటిన వారు ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చన్నారు. రూ.100 అపరాధ రుసుముతో సెప్టెంబరు 15 లోగా ఫీజు కట్టుకోవాలని వారు సూచించారు.

మంత్రిని కలిసిన తుని నాయకులు

తునిరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం జరిగిన కాకినాడ పార్లమెంట్ టీడీపీ, పార్టీ అనుబంధ విభాగాల విస్తృత స్థాయి సమావేశానికి తుని నియోజకవర్గ టీడీపీ నేతలు తరలి వెళ్లారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాలతో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ పార్లమెంట్ కమిటీల నియామకం, నియోజకవర్గ కమిటీల నియామకంపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం యనమల రాజేష్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి తుని నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను వివరించారు.

డీఎస్సీలో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ

అభినందించిన విద్యాధికారులు

కోటనందూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో గ్రామీణ విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలానికి చెందిన గుడివాడ సాయి అంబికా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 89.24మార్కులతో 17వ ర్యాంక్ సాధించింది. కోటనందూరుకు చెందిన కుప్పా వీరమణికంఠేశ్వరి, రుత్తల దుర్గాభవాని, రొంగల రాజ్యలక్ష్మి, దగ్గుబిల్లి నాగదుర్గా స్వాతి, రాజాన నీలిమ, యర్ర స్వాతి టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. స్థానిక ఏపీఎం సంస్థలో వీరు శిక్షణ పొందారు. అలాగే మండలానికి చెందిన 25మంది డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించారు. ఎంఈవోలు అడిగర్ల శ్రీనివాస్, ఎం.రామ్‌శేఖర్, అల్లు విష్ణు తదితరులు అభినందించారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏవో



కత్తిపూడిలో ఎరువుల స్టాక్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి గాంధీ

శంఖవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. సోమవారం కత్తిపూడిలో ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించి స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఎరువులకు వేరే వాటితో లింక్ పెట్టి అమ్మకాలు సాగిస్తే ఉపేక్షించమన్నారు. ధరల పట్టిక, స్టాక్ వివరాలు సూచికలో ఉంచాలని ఆదేశించారు. బస్తాలను తూకానికి వేసి బరువును పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మణిబాబుకు సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేవీఆర్ అపార్టెమెంట్ వద్ద కాట్రావులపల్లి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర అంగన్‌వాడీ సెక్రటరీ పోలినాటి ధర్మనంకుమారి శాస్త్రి, టీడీపీ మండల మహిళా కార్యదర్శి ఎల్లాటి అమ్మాజీ, గండుపల్లి సుజాత, జె.కొత్తూరు గ్రామానికి చెందిన తిప్పన సత్యవతి తదితరులు టీడీపీ మండల అధ్యక్షుడు జీను మణిబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేటలో ట్రాఫిక్ రద్దీ

జగ్గంపేట రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, సోమవారం సంత కావడంతో జగ్గంపేట మెయిన్ రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువైంది. వినాయకుని విగ్రహాల కొనుగోలుకు, సంతకు వస్తువుల కొనుగోలుకు మార్కెట్‌కు ప్రజలు తరలివచ్చారు. దీంతో జగ్గంపేట మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువైంది. దీంతో ఎస్ఐ రఘునాథరావు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

మట్టి వినాయకుని విగ్రహాల పంపిణీ

కోటనందూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు కోటనందూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత వెలగా వెంకటకృష్ణారావు మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలగా వెంకట గంగాధర రంగ నాయకులు, పల్లా కిషోర్ పాల్గొన్నారు.

తునిరూరల్, (ఆంధ్రజ్యోతి): తునిలో ధనలక్ష్మి జ్యువెలర్స్ అధినేత దాడిశెట్టి విష్ణుచక్రం ఆధ్వర్యంలో సిబ్బంది వినాయక ప్రతిమలను బాటసారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

రక్తదాన శిబిరం

తునిరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అలయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. అలయన్స్ క్లబ్ ప్రతినిధులు, డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీ, పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు.